నమస్తే తెలంగాణ
# కరీంనగర్
6 | కరీంనగర్, మంగళవారం 3 జూన్ 2025 | KARIMNAGAR



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి

## అల్ఫోర్స్ అద్భుత విజయం

కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 2 : ఐఐటీ అడ్వాన్స్‌డ్–2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత విజయం సాధించారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారు. అజ్మీరా పురుషోత్తం నాయక్ 166వ ర్యాంకు, పీఎస్ సాయిధృవ 557, ఎన్ అనిరుద్‌సాయి 657, బీ ఆదిత్య 945, బీ విష్ణు 1203, ఎం అక్షిత 1224, వీ హృషికేష్ 1329, ఆర్ గోవర్ధన్ 1506, జే వామిక 1604, బీ చైత్రవ్ రాజు 1640, ఈ శశిలాల్ 1899, కే వీరేంద్రప్రసాద్ 2120, డీ కార్తీక్‌రెడ్డి 2150, ఎస్ విఘ్నేష్ 2293, డీ అభిరామ్ 2349, ఏ శశిప్రీతమ్ 2463, ఈ అంకిత్‌సాయి 2613, మహ్మద్ అబ్దుల్‌హక్ 2766, డీ విశాల్ 2917 ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు నలుగురు, 2వేల లోపు 11 మంది, 3వేల లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని విద్యా సంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం కరీంనగర్‌లోని వావిలాలపల్లి కళాశాల ఆవరణలో అభినందించారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి ఇంతటి ఘనవిజయానికి తోడ్పడ్డాయని చెప్పారు. ప్రతి సంవత్సరం అల్ఫోర్స్ అందించిన కోచింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీలో సీట్లు సాధించే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నదని తెలిపారు. నీట్, ఎంసెట్‌లోనూ విద్యార్థులు అద్భుతంగా రాణించారని గుర్తు చేశారు. ఇంతటి విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ మనోహర్ రెడ్డి

## ట్రినిటీ విజయభేరి

కరీంనగర్ హౌసింగ్ బోర్డుకాలనీ, జూన్ 2: జేఈఈ– అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఏ రఘుపతి జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు, ఎం నిఖిత్ నాయక్ 194, డీ మహేశ్ 225, ఏ రఘుపతి 226, బీ సిద్ధిక 1107, సీహెచ్ ఐశ్వర్య 1129, బీ ఠాగూర్ 1274, ఆర్ నవదీప్ 1701, కే నిస్సి జాస్పర్ 2172, జీ అజయ్ 3077, కే అక్షర 4524వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్పష్టమైన ప్రణాళిక, మెరుగైన విద్యా బోధన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తమ కళాశాలలో ఫీజు రాయితీ ఇస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి ఐఐటీ– అడ్వాన్స్‌డ్ లాంగ్ టార్మ్ ప్రారంభించబోతున్నామని తెలిపారు. రాబోయే టీఎస్ నీట్ ఫలితాల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభినందన సభలో పాల్గొన్న విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తమ విద్యకు ట్రినిటీ కళాశాలలు మారుపేరని, ఉత్తమ ర్యాంకుల సాధన కేవలం తమ కళాశాలలకే సాధ్యమని చెప్పారు.

## నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, జూన్ 2 : నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి నవోదయ విద్యాలయ సమితి న్యూఢిల్లీ వారు నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. 2025–26లో 5వ తరగతి చదువుతున్న అభ్యర్థులు జూలై 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 13న ఉదయం 11.30 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అర్హులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 5వ తరగతి చదవాలని, తల్లిదండ్రులు తప్పనిసరిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నివసించి ఉండాలని, అభ్యర్థులు 3, 4, 5 తరగతులు రూరల్ లో చదివి ఉండాలని సూచించారు. https://navodaya.gov.in ద్వారా లింక్ చేసిన NVS అడ్మిషన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసుకోవాలని సూచించారు.ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని విరివిగా ఐదో తరగతి విద్యార్థులందరూ కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## అమరవీరులకు అవమానం

### ‘ఖని’లో అలంకరణ లేక బోసిపోయిన స్మారకస్తూపం



బోసిపోతున్న అమరవీరుల స్మారక స్తూపం

కోల్‌సిటీ, జూన్ 2 : విప్లవాల గని.. గోదావరిఖనిలో తెలంగాణ అమరవీరుల త్యాగాలకు అవమానం జరిగింది. సకల జనుల సమ్మెకు పురుడు పోసి.. ఉద్యమాల పురిటిగడ్డగా పేరున్న ఇక్కడ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు అమరవీరుల స్తూపం కనీసం అలంకారానికి నోచుకోలేదు. దీంతో స్తూపం బోసిపోయింది. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల ఆత్మఘోష గొల్లుమన్నది. అమరవీరుల త్యాగాలకు ఇదేనా విలువ అంటూ రామగుండం నగర పాలక సంస్థ అధికారుల తీరుపై పలువురు ఉద్యమకారుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అంటే వారం రోజుల ముందుగానే వారోత్సవాలను పండుగలా జరుపుకునే ఆనవాయితీ ఉండేది. కానీ, ఇప్పుడు నిరాడంబరంగా జరపడం, కనీసం స్తూపాన్ని పూలతో అలంకరించేందుకు కార్పొరేషన్‌లో పైసలు లేవా..? అంటూ ఉద్యమకారులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రం కోసం కొట్లాడి..లాఠీ దెబ్బలకు ఎదురునిలబడి.. పోరాడి ప్రాణాలు అర్పించిన అమరవీరులకు ఇచ్చే గౌరవం ఇదేనా..? అని మండిపడ్డారు.

### కరీంనగర్ డివిజన్ల

## పునర్విభజనకు నోటిఫికేషన్

- ఈ నెల 4న ముసాయిదా
- 21న ఫైనల్ జాబితా
- వివిధ పార్టీల నాయకుల్లో జోరుగా చర్చ

కార్పొరేషన్, జూన్ 2: మున్సిపల్ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనున్న నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో విలీన గ్రామాలకు సంబంధించి డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర సర్కారు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 3న డివిజన్ల విభజనకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. 4న ముసాయిదా జాబితాను పత్రికల్లోనూ ప్రచురించాల్సి ఉంటుంది. 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు, నివేదికలు స్వీకరించాలి. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంటుంది. 17, 18 తేదీల్లో డివిజన్ల విభజన పత్రాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. 19న ముసాయిదా జాబితాను సీడీఎంఎకు పంపించాలి. 20న సీడీఎంఏ నుంచి ప్రభుత్వానికి నివేదికను పంపించి, 21న ఫైనల్ డివిజన్ల జాబితాను విడుదల చేస్తారు.

### మొదలైన చర్చలు

కరీం‘నగరం’ సమీపంలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరపాలక అధికారులు 66 డివిజన్లకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను అనుసరించి డివిజన్ల విభజనను పూర్తి చేసి సీడీఎంఏకు పంపినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ఒక జాబితా కూడా గతంలోనే సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టింది. అప్పటి నుంచే కార్పొరేషన్‌లోని వివిధ పార్టీల నాయకుల్లో డివిజన్ల విభజనపై ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది. ఎవరికివారే తమ డివిజన్ల విభజన ఎలా జరిగింది? ఏయే కాలనీల ఓట్లు ఏయే ప్రాంతాల్లో కలిపారన్న చర్చలు సాగాయి. ప్రతి డివిజన్‌కు 4500 నుంచి 5500 ఓటర్లు ఉండేలా అధికారులు డివిజన్లను విభజించినట్లు తెలుస్తుండగా, అయితే పలు డివిజన్లల్లో దూర ప్రాంతాలకు చెందిన ఇండ్లను చేర్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి ఫిర్యాదులు, తమ అభ్యంతరాలు తెలిపేందుకు ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నాయకులు సిద్ధమయ్యారు.



గంభీరావుపేట: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



కరీంనగర్‌లోని గాంధీనగర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ఎదుట జెండా వందనం చేస్తున్న కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు, కార్యకర్తలు

# ‘ఆవిర్భావం’ అదరహో..

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు
- జిల్లాకేంద్రాల్లో అధికారిక కార్యక్రమాలు
- ఊరూరా జాతీయ జెండాల ఆవిష్కరణ
- తెలంగాణతల్లి విగ్రహాలకు పూలమాలలు.. అమరవీరులకు నివాళి
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు
- బీఆర్ఎస్ కార్యాలయాల్లో ఘనంగా సంబురాలు



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అట్టహాసంగా జరిగాయి. ఊరూరా పండుగను తలపించాయి. కలెక్టరేట్‌లు, పరేడ్ గ్రౌండ్‌లు, ప్రభుత్వ ఆఫీసులు, వివిధ పార్టీల కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూల మాలలు వేశారు. అమరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. జిల్లా కేంద్రాల్లో అధికారికంగా జరిగిన వేడుకల్లో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించి, ఉత్తమ అధికారులకు ప్రశంసా పత్రాలు అందించారు. కరీంనగర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌష్ ఆలం, జగిత్యాలలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బీ గితే, పెద్దపల్లిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొన్నారు. ఇటు బీఆర్ఎస్ కార్యాలయల్లో వేడుకలు ఘనంగా జరిపారు. కరీంనగర్ బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, పెద్దపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్, జగిత్యాలలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సిరిసిల్లలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. నాటి ఉద్యమ రోజులు, కేసీఆర్ చేసిన పోరాటం, అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.



గంగాధర: బూరుగుపల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు



సిరిసిల్ల: తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నినదిస్తున్న బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నాయకులు



పెద్దపల్లిలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డి, నాయకులు

## నీళ్లు దోచుకుపోయే ప్రయత్నం

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక దయనీయ పరిస్థితులు
- పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్

పెద్దపల్లి, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి మన కళ్ల ముందే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నీళ్లు దోచుకుపోయే ప్రయత్నాలు చేస్తున్నారని, అయినా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లుండి కూడా చూడకుండా ఉంటున్నాడని పెద్దపల్లి జడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెద్దపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి జాతీయ జెండా, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మన హక్కులను కాలరాస్తూ పక్క రాష్ట్రానికి నీళ్లు ఇవ్వడం దుర్మార్గమని, దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. తెలంగాణ అంటేనే బీఆర్ఎస్ పార్టీ అని, తెలంగాణ ఆవిర్భావం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందనే విషయం యావత్తు ప్రపంచానికి తెలుసన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలుపడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు. రాష్ట్రం కాంగ్రెస్ చేతుల్లోకి వెళ్లిన తర్వాత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందలేదని దుష్ప్రచారం చేస్తున్నారని, ముఖ్యంగా మిషన్ భగీరథ పథకం ఫెయిల్ అయిందని అంటున్నారని, కానీ తాను ఇటీవల ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బూర్గుగూడెం వెళ్తే అక్కడ మిషన్ భగీరథ నీళ్లు తప్ప వేరే లేవని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కళ్లున్నా చూడలేని కబోదులని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాలను ఎండగట్టాలని, గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ అవినీతిని చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులపై ఉందన్నారు.

### దీక్షతోనే తెలంగాణ

కాంగ్రెస్ మోసపూరిత మాటలతో మోసపోయామని తెలంగాణ ప్రజలు గ్రహించారు. పద్నాలుగు ఏండ్ల కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ. తెలంగాణ తెచ్చుడో కేసీఆర్ సచ్చుడో.. అంటూ చేసిన ఆమరణ దీక్షతోనే తెలంగాణ వచ్చింది. రాష్ట్ర సాధకుడిగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదేండ్లు పాలన చేసిన కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని గొప్పగా తీర్చిదిద్దారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ప్రజలు ఆలోచనకు వచ్చారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైతం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. కాంగ్రెస్ పాలనతో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో వివరించాలి.

**- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి**



గోదావరిఖని: నినదిస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కార్మికులు, నాయకులు



జ్యోతినగర్: ఎన్టీపీసీలో గాల్లోకి బెలూన్లను ఎగురవేస్తున్న ఈడీ, జీఎంలు, అధికారులు



వేములవాడ: తెలంగాణ చౌక్‌లో జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

## కేసీఆర్‌తోనే అభివృద్ధి

- బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, జూన్ 2: ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గుర్తు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాతోపాటు బీఆర్ఎస్ జెండాను పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆవిష్కరించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండా, బీఆర్ఎస్ జెండాను తోట ఆగయ్య ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ఉద్యమ పోరాటంతోనే ఫలించిన రాష్ట్రాన్ని దేశానికే మార్గదర్శకంగా తీర్చిదిద్దారని కొనియాడారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ పాలన అందించారని తెలిపారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## కేసీఆర్ పాలనలో ఎన్నో పథకాలు

### బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల, జూన్ 2 : పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులతో కలిసి జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ సాధనే ధ్యేయంగా సబ్బండవర్గాలను ఏకంచేసి రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. పదేండ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు చేట్టారన్నారు. సీఎం ఫొటో లేదని కాంగ్రెస్ గుండాలు క్యాంప్ కార్యాలయాలు, తెలంగాణ తల్లి విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దావ వసంత మాట్లాడుతూ, కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో అధినేత తెలంగాణ ప్రజలను ఏకం చేసి రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు.